

రేపు ఉద్యోగమేళా

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 9న మెగా ఫార్మా ఉద్యోగ మేళా నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం హైదరాబాద్‌లకు చెందిన అరబిందో, ఫార్మా కంపెనీ, ఎంఎస్ఎన్ ల్యాబ్ సంస్థలు ఈ మేళాను నిర్వహించనున్నాయని అన్నారు. 2020 నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు ఎంపికకు అర్హులని తెలిపారు. బిఎస్‌సి, ఇంటర్‌లో సంబంధిత కోర్సులు పూర్తి చేసిన వారు మేళాకు హాజరు కావచ్చునని పేర్కొన్నారు. హాజరు కాబోయే అభ్యర్థులు విద్యార్హత, తరగతి ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. సందేహాల నివృత్తికి కళాశాల పనిచేసే సమయంలో వచ్చి తెలుసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు ఫార్మా ఉద్యోగ మేళాకు హాజరుకావచ్చునని తెలిపారు.

సామాన్యులకు చేరువలో ఇసుక



రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తోంది. జిల్లా యంత్రాగం ఈ విధానాన్ని అమలు చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. తొలుత అన్ని జిల్లాల్లోని నిల్వ కేంద్రాల్లో ఉన్న ఇసుకను మాత్రమే ఇవ్వనున్నారు. నిర్వహణ ఖర్చులు, సీనరేజ్ ఛార్జీలను మాత్రమే వసూలు చేసి ప్రజల కు ఇసుక అందజేయనున్నారు. ఇప్పటికే ఈ విధానం పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లకు దిశానిర్ధేశం చేశారు.

- **నేటి నుంచి కొత్త ఇసుక విధానం**
- **తొలుత నిల్వ కేంద్రాల్లో పంపిణీ**
- **తవ్వకాల ఖర్చు, సీనరేజ్ వసూలు**
- **ఎడ్లబళ్ల ద్వారా విక్రయాలకు అనుమతి**
- **టెక్కలి, అంగూరు నిల్వ కేంద్రాల్లో అమ్మకాలు**

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో గత ప్రభుత్వంలో ఇసుక వ్యాపారాన్ని సాగించిన కాంట్రాక్టర్లు, జిసికెసి, ప్రతిమా ఇన్ఫ్రాలను ఇప్పటికే తొలగించారు. వారి ఆధ్వర్యాన జిల్లాలోని టెక్కలి, అంగూరు నిల్వ కేంద్రాల్లో దాచి ఉంచిన ఇసుక నిల్వలను ప్రభుత్వం ఇప్పటికే స్వాధీనపర్చుకుంది. జిల్లాలో ఈ రెండు నిల్వ కేంద్రాల్లో సుమారు 48 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలున్నాయి. వాటని మెట్రిక్ టన్ను రూ.340కే అందించేందుకు నిర్ణయించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న నిల్వలను ఇచ్చేందుకు వీలుగా విఆర్ఒ, కానిస్టేబుల్, మైన్స్ సిబ్బందిని నిమించారు. ఇప్పటికే జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించి ఇసుక ఎలా విక్రయించాలన్నదానిపై స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు చేయకుండా, నిల్వ కేంద్రాల నుంచి తీసుకున్నది మాత్రమే విక్రయిస్తారు. ఈ నిల్వలను అక్రమంగా విక్రయాలు జరపకుండా ఎస్ఇబి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా నిఘా ఉంచనున్నారు. నిల్వ కేంద్రం నుంచి తరలించే ఇసుకకు వే బిల్లులు జారీచేస్తారు. సెక్యూరిటీ స్టేషనరీ పత్రాలతో కూడిన వేబిల్లులను గనులశాఖ ప్రధాన కార్యాలయం నుంచి జిల్లా గనుల శాఖకు పంపించారు. సీనరేజ్ కింద టన్నుకు రూ.88 తీసుకుంటారు. ఇప్పటివరకు ఉన్న సంస్థలు ఇసుక తవ్వినందుకు అయిన ఖర్చు కింద టన్నుకు రూ.30 చొప్పున వసూలు చేస్తారు. రీచ్ నుంచి దూరంగా ఉన్న నిల్వ కేంద్రానికి ఇసుక తరలించి ఉం టే.. రవాణా ఖర్చు కింద టన్నుకు కి.మీ.కు రూ.4.90 చొప్పున లెక్కిస్తారు. నిర్వహణ ఖర్చు కింద టన్నుకు రూ.20 తీసుకోనున్నారు. వీటన్నింటికీ కలిపి 18 శాతం జిఎస్‌టి ఆయా స్టాక్ పాయింట్లలో టన్ను ఇసుక ఎంతనేది కలెక్టర్ స్థాయిలో నిర్ధారించి విక్రయించనున్నారు. గతంలో ప్రభుత్వం ప్రతి టన్నుకూ రూ.375 వంతున కాంట్రాక్టరు నుంచి వసూలు చేసేది. కానీ, ప్రస్తుత విధానంలో సీనరేజ్ కింద వసూలు చేసే రూ.88 వంతున వసూలు చేసి జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీల ఖాతాలకు ప్రతినెలా సీనరేజి మొత్తాన్ని జమ చేస్తారు.

ఎడ్ల బండ్లలో నేరుగా తెచ్చుకునేందుకు అనుమతి

వాగులు, వంకలు, చిన్న నదుల్లో ఎడ్ల బండ్ల ద్వారా నేరుగా ఇసుక తవ్వి తీసుకెళ్లేందుకు వీలు కల్పించారు. సమీప గ్రామాల ప్రజలు తమ నిర్మాణ అవసరాలు, అక్కడి ప్రభుత్వ నిర్మాణాలకు ఎడ్ల బండ్ల ద్వారా మాన్యువల్ ద్వారా తవ్వి ఇసుకను తరలించుకునేందుకు అవకాశం కల్పించారు. నిర్వహణ ఖర్చు కింద టన్నుకు రూ.20 చొప్పున తీసుకునే సొమ్మును వే బిల్లుల కొనుగోలు, సెక్యూరిటీ సిబ్బంది ఏర్పాటు, మున్ముందు రీచ్లకు పర్యావరణ అనుమతుల కోసం ఫీజులు చెల్లించేందుకు వినియోగిస్తారు. నిల్వ కేంద్రాల్లో ఇసుక ధర తెలిసేలా బ్యానర్లు ఏర్పాటు చేస్తారు. కలెక్టర్, జిల్లా గనులశాఖ అధికారి పేరిట సంయుక్తంగా బ్యాంకు ఖాతా తెరవనున్నారు. ఇసుకకు ప్రజలు చెల్లించిన సొమ్మును ఆ ఖాతాలో జమచేస్తారు.

తొలుత వారం, పది రోజులు చేతిరాతతో వేబిల్లులు ఇస్తారు. ఆ తర్వాత ఆన్‌లైన్ వే బిల్లులు జారీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే బ్యారేజీలు, జలాశయాల పరిధిలో పూడిక రూపంలో ఉన్న ఇసుకను తవ్వి తీసేందుకు ఆలోచన చేస్తున్నారు. వీటికి పర్యావరణ అనుమతులు అవసరం లేకపోయినా, కాలుష్య నియంత్రణ మండలి నుంచి కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్మెంట్ (సిఎఫ్ఇ), కన్సెంట్ ఫర్ ఆపరేషన్ (సీఎఫ్‌ఓ)కి ఫీజులు చెల్లించి అనుమతి తీసుకోనున్నారు. గత కాంట్రాక్టులను రద్దు చేసిన అనంతరం పూర్తిస్థాయిలో ఈ విధానం అమలు చేసేందుకు గనులశాఖ సిద్ధమవుతోంది. అందులో భాగంగా వంశధార, నాగావళి, మహేంద్ర తనయ, బాహుదా నదుల్లో ఉన్న ఇసుక నిల్వలను గుర్తించి సెప్టెంబరు చివరి నాటికి వీటికి అనుమతులు తీసుకుని ఉచిత ఇసుక విధానాన్ని శత శాతం అమలయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మైన్స్ అధికారులు చెపుతున్నారు. అలాగే ఎక్కడైనా అక్రమాలు చోటు చేసుకుంటున్నట్టు భావిస్తే 9701691657 వాట్సాప్ నంబరుకు, 18004256012 టోల్ ఫ్రీనంబరుకు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ఓంకార్ ఆశయ సాధనకు కృషి

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి– పలాస

ఓంకార్ మాస్టర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు పిలుపునిచ్చారు. మండలంలోని మాకనపల్లిలో సిపిఎం ఆధ్వర్యాన ఓంకార్ మాస్టార్ సంస్మరణ సభ జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓంకార్ మాస్టార్ విద్యార్థి సంఘం నాయకుడిగా, ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా, రైతాంగ ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు చేశారని వారు కొనియాడారు. ఓంకార్ మాస్టర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్వహించిన జీడి రైతు ఉద్యమంలో పాటలు పాడుతూ సురకైన పాత్ర పోషించారని వారు అన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేసే వారిని పేర్కొన్నారు. పాలక పక్షాలు అనుస రిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేయడమే మనం ఆయనకి చ్చిన ఘనమైన నివాళిని అన్నారు. విశ్రాంత ఆదాయ పన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్ జుత్తు తాతారావు, అదే గ్రామానికి చెందిన వైద్యులు తెప్పల ఆనందరావు ఉద్యమాల్లో ఓంకార్ మాస్టర్ సాన్నిహిత్యాన్ని వివరించారు. పేదరికంలో పుట్టి అంచెలంచెలుగా ఆంధ్రా యూనివర్సిటీ వరకు చదువుకొని తిరిగి అదే ప్రాంతానికి ఉపాధ్యాయు డుగా పనిచేస్తూ పేదల సమస్యల పై ఒక కళాకారు డుగా సామాజిక కార్యకర్తగా విభిన్న రూపాల్లో తమ పోరాట ప్రతిమను చాటిచెప్పారని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసిన వ్యక్తి ఓంకార్ మాస్టర్ అని కొనియాడారు. సభ ప్రారంభానికి ముందు ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాతిన కృష్ణమూర్తి, హరిపురానికి చెందిన వైద్యులు ఖగేశ్వరరావు, జుత్తు సింహాచలం, సంగారు లక్ష్మీనారాయణ, యుటిఎఫ్ నాయకులు లండ బాబూరావు, లఖినాన వెంకటా చలం, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, దుమ్ము శంకరరావు, గేదెల నీలకంఠం, కుత్తుం వినోద్, హేమశోధన, బి.ఆనందరావు, మాకన్నపల్లి గ్రామ సూర్యోదయ యువజన సంఘం, ఉద్దాన అభివృద్ధి వేదిక, గ్రీన్‌ఆర్మీ, సూర్యోదయ మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

'ఆఫ్‌షోర్' పూర్తికి చర్యలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



టెక్కలి : మదనగోపాల సాగరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి– పలాస

మండలంలోని రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వంశధార అధికారులతో, టిడిపి నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. పనులు ఎంత వరకు వచ్చాయి? ఇంకా ఎంత శాతం పనులు చేయాల్సి ఉంది? పనులు చేసేందుకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ఇప్పటి వరకు ఎంత శాతం నిధులు మంజూరు అయ్యాయి? కాంట్రాక్టరు పనులు చేసేందుకు ముందుకు వస్తున్నారా? నిర్వాసితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించారా లేదా? ఇంక ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? తదితర అంశాలను వంశధార అధికారులకు అడిగి తెలుసుకున్నారు. దీనిపై వంశధార టెక్కలి ఇఇ శేఖర్ ఇప్పటి వరకు 45 శాతం పనులు జరిగియన్నారు. మోళియాపుట్టి మండలం వద్ద కొండకు టెన్నిలింగ్ (కొండకు రంధ్రాలు) చేయాల్సి ఉందని, నిధులు లేక పోవడంతో పనులు నిలిచిపోయని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వంశధార, నాగావళి, మహేంద్ర తనయ, బహుదా నదులు ఉన్నా... రిజర్వాయరు లేకపోవడంతో పంట భూములకు సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదన్న విషయం తెలుసుకున్నాని చెప్పారు. త్వరితగతిన ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆయనతో పాటు ఆర్‌డిఒ భరత్ నాయక్, వంశధార ఎస్ఇ బి.రాంబాబు, ఇఇ శేఖర్, డిఇలు వెంకటకృష్ణ, కె.ధనుంజయ, రాజశేఖర్, ప్రేమ్, టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు టంకాల రవిశంకర్ గుప్తా, మల్లా శ్రీనివాసరావు, జనసేన నాయకులు డాక్టర్ వి.దుర్గారావు, కొరికాన శంకర్, డొక్కరి శంకర్, ఎం.చిన్ని ఉన్నారు.

మదనగోపాల సాగరం పరిశీలన

టెక్కలి : వంశధార నీరు నిల్వ ఉన్న మదనగోపాల సాగరాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం వంశధార నీరు విడుదల జరిగిన దృష్ట్యా కలెక్టర్ పరిశీలించి నీటి నిల్వ ఉన్న సామర్థ్యం ఎంత, శివారు ప్రాంతాలకు నీరు చేరడం వంటి అంశాలపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నీటి సరఫరా, ఎత్తిపోతల పథకాలకు నీరు సరఫరా అయితే శివారు ప్రాంతాలకు నీరు అందుతుందా? లేదా? అనే దానిపై ఆరా తీశారు. ఈయనతో పాటు వంశధార అధికారులు ఉన్నారు.

మలేరియాతో గిరిజన విద్యార్థిని మృతి

వెన్నెలవలసను సందర్శించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి– సరుబుజ్జిలి

మండలంలోని వెన్నెలవలస గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న బిడ్డిక రస్మిత (8) అనే విద్యార్థిని మలేరియా జ్వరంతో మృత్యువాత పడింది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం అచ్చభకు చెందిన రస్మిత ఇటీవల ఈ పాఠశాలలో ప్రవేశం పొందింది. రస్మిత, ఆరో తరగతి చదువుతున్న సవర ప్రభావతి జ్వరం బారిన పడడంతో సరుబుజ్జిలి ప్రాథమిక వైద్య కేంద్ర వైద్యాధికారులు రక్త పరీక్షలు నిర్వహించి మలేరియాగా నిర్ధారించారు. అనంతరం జిల్లా సర్వజనాస్పత్రికి మెరుగైన వైద్యం నిమిత్తం రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి రస్మిత మృతి చెందింది. విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి ఆదివారం వెన్నెలవలస గిరిజన ఆశ్రమం బాలికల ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం తొమ్మిది గంటల సమయంలో బాలికలందరూ అల్పాహారం తీసుకుంటున్నారు. ఆ సమయంలో ప్రధానోపాధ్యాయులు, వార్డెన్, ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు కాకపోవడం ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సవర స్వప్న, కొండగొర్రి రిబిక, సవర అంజలిలు కూడా జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. తక్షణమే వైద్య పరీక్షలు నిర్వహించి జిల్లా సర్వజనాస్పత్రికి తరలించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. విషయం తెలు సుకున్న హెచ్ఎం, ఉపాధ్యా యులు పాఠశాలకు చేరుకున్నా రు. పాఠశాలకు పంపిణీ చేసిన దోమతెరలు ఎక్కడున్నా యని హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం స్పందించి కొన్ని ఇక్కడే ఉన్నాయని, కొంతమంది విద్యార్థులు ఇంటికి తీసుకెళ్లిపోయారని, ఇలా పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో డిఎంహెచ్ఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. దోమతెరలను ఇంటికి తీసుకెళ్లేందుకు మీరు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. బాలికల ఆరోగ్యంపై దృష్టి సారించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. భోజనశాల సమీపంలోని రెండు ప్లాస్టిక్ డ్రమ్ముల అన్నం వ్యర్థాలను చూసి ఇటువంటి అపారిశుధ్య ప్రాంతాలను ఉంచడం వల్ల దోమల నిలయంగా మారుతాయని అన్నారు. విద్యార్థులకు తాగడానికి వేడి నీరు, ఆహారం అందించాలన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. రోజూ బృందాలుగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని మండల వైద్యాధికారులు సంతోష్‌కుమార్, సాహితీ ప్రియదర్శిలను ఆదేశించారు. కార్యక్రమంలో మలేరియా జిల్లా మేనేజర్ పి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.



రస్మిత (ఫైల్)

10న జాబ్‌మేళా

ఎచ్చెర్ల : ఎచ్చెర్లలోని ఐటిఐ కాలేజీలో ఈ నెల 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, ప్రవేశాల జిల్లా కన్వీనర్ లండ సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులకు ఇదొక సువర్ణ అవకాశమని తెలియాజేశారు. ఐటిఐలో ఉత్తీర్ణులైన వారు హాజరుకావాలన్నారు. నెల్లూరు ఆల్ స్టోమ్, ఇసుజ మోటార్స్ లిమిటెడ్, ఇంప్రూము ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, అనంతపురానికి చెందిన ఉదయ్ మూబిస్, ఎపిటికెఐఎంఎల్ తదితర పరిశ్రమలు సంబంధిత ప్రతినిధులు హాజరవుతున్నారు. 18 నుంచి 39 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు ఉదయం 9 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలు, రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు.

'అల్లూరి' పోరాటం ఆదర్శం

టెక్కలి : అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటాలు నేటి యువతరానికి ఆదర్శప్రాయమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవాలను ఆదివారం స్థానిక బిసి, ఎస్‌టి వసతిగృహాల ఆవరణలో నిర్వహించారు. ముందుగా సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయుధ పోరాటంలో సీతారామరాజును ఆదర్శంగా తీసుకుని యువత ఉద్యమాల వైపు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జిల్లా బాధ్యులు ఉర్జాన దుర్గాప్రసాద్, వార్డెన్ శ్రావణి, బి.తరుణ్‌మాధురి, దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ మీనాక్షి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

కోటబొమ్మాళి: పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలకు ఏ పూట వండిన భోజనం ఆ పూటే పెట్టాలని, వేడినీరు ఇవ్వాలని జిల్లా వైద్యాధికారి బొడ్డేపల్లి మీనాక్షి సూచించారు. స్థానిక కస్తూరిభాగాంధీ పాఠశాలలో విద్యార్థినులు అతిసార బారిన పడ్డారని తెలుసుకున్న ఆమె ఆదివారం పాఠశాలను సందర్శించి పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో వారం రోజులు పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. కాచిన నీరు తాగించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. అలాగే సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి రోణంకి జయప్రకాష్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల పరిస్థితి, డయేరియా ఎంత మంది పిల్లలకు వచ్చింది, ఆస్పత్రిలో ఎంత పిల్లలకు చికిత్స అందించారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు పూర్తిగా కోలుకొనే వరకు వారికి ప్రత్యేక భోజనం, వేడి నీళ్లు అందించాలని ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రసన్నకు ఆదేశించారు. వాటర్ ట్యాంకును క్లోరినేషన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్, కొత్తపల్లి పిహెచ్‌సి డాక్టర్ మనీష, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తెప్ప బోల్తా : మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి– సోంపేట

సముద్రంలో వేటకు వెళ్లి తెప్ప బోల్తాపడడంతో మండలంలోని బారువకు చెందిన వలిశెట్టి జోగారావు (48) అనే మత్స్యకారుడు ఆదివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన దానయ్య, సింహాచలం, కుమారస్వామి, భాస్కర్లతో కలిసి జోగారావు వేకుజామున చేపల వేటకు వెళ్లాడు. లోపలకు వెళ్లేసరికి అలల ఉధృతి ఎక్కువై తెప్ప బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జోగారావు మృతి చెందగా, మిగిలిన వారు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. మృతుడికి భార్య పార్వతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఉద్యాన పంటల విస్తరణకు ప్రోత్సాహం

- **కేంద్ర, రాష్ట్ర పథకాల ద్వారా రాయితీలు అందిస్తున్నాం**
- **ప్రధానంగా జీడి, మామిడి, కొబ్బరి సాగుపై ప్రత్యేక శ్రద్ధ**
- **కూరగాయలు, పూల సాగుకూ రాయితీలు**
- **జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి ప్రసాద్**

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తరణకు రైతులకు పలురకాల పథకాల కింద ప్రత్యేక ప్రోత్సాహక చర్యలు చేపడుతున్నామని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి ప్రసాద్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలతో పలు పునరుద్ధరణ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. కూరగాయలు, పూలు సాగు చేసే రైతులకూ ప్రభుత్వం ద్వారా చేయూత అందిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా జీడి, మామిడి తోటల పెంపకం, సాగు చేసేందుకు రైతులను ఆకర్షించేలా పలురకాల రాయితీలను ఇస్తున్నామన్నారు. ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి సాగుపై ప్రత్యేక దృష్టిసారించామని చెప్పారు. ఉద్దానంలో తిత్లీ తుపాను ప్రభావంతో కొబ్బరి దిగుబడి తగ్గడం, చీడపీడలు, వ్యాధుల ప్రభావంతో ఆశించినంత లాభాలు రాని నేపథ్యంలో కొబ్బరి మొక్కల పెంపకానికి అవసరమైన రాయితీలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగు, విస్తరణ, రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో అనేక అంశాలను వెల్లడించారు.

? జిల్లాలో ఉద్యాన పంటల సాగు పరిస్థితి ఎలా ఉంది?


జిల్లాలో ముఖ్యమైన అన్ని ఉద్యాన పంటలు కలిపి 2,45,978 ఎకరాల్లో సాగవుతున్నాయి. అందులో జీడి మామిడి 1,23,115 ఎకరాల్లో, మామిడి 13,090 ఎకరాల్లో, కొబ్బరి 97,355 ఎకరాల్లో సాగవుతోంది. ఆయిల్‌పామ్ 10,585 ఎకరాల్లో సాగవుతుండగా కూరగాయల పంట 2,503 ఎకరాల్లోను, కోకో పంట 455 ఎకరాల్లో సాగవుతోంది.

? ఉద్యాన పంటల విస్తరణ, ప్రోత్సాహానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటోంది?

జిల్లాలో సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ ప్రణాళిక, రాష్ట్రీయ కృషి వికాస యోజన, కొబ్బరి అభివృద్ధి బోర్డు, కేంద్ర ఆహార భద్రతా మిషన్ పేరుతో పలురకాల పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో మామిడి, అరటి, కోకో పంట సాగు, సంకరజాతి, కూరగాయలు, పూల తోటల విస్తరణ, కొబ్బరి, ఆయిల్‌పామ్, తోటల పునరుద్ధరణ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఉద్యానశాఖ ద్వారా పంటల ప్రోత్సాహానికి రైతులకు ఎటువంటి రాయితీలను ప్రభుత్వం అందిస్తోంది. మామిడి విస్తరణ పథకం కోసం ఎంపికయ్యే లబ్ధిదారులకు మొదటి సంవత్సరం ఎకరాకు రూ.3,192, తర్వాత రెండు సంవత్సరాలకు రూ.1064.80 చొప్పున అందిస్తోంది. జీడి మామిడి సాధారణ సాంద్రత ఉన్న ప్రాంతాల్లోని లబ్ధిదారులకు తొలి ఏడాది ఎకరాకు రూ.4,800 తర్వాత రెండు సంవత్సరాలకు రూ.1600 వేలు చొప్పున వారి ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తోంది. అదే విధంగా అధిక సాంద్రత ఉన్న ప్రాంతాల రైతులకు తొలి ఏడాది ఎకరాకు 9,600 ఆ తర్వాత రెండు సంవత్సరాలకు రూ.1600 చొప్పున అందిస్తోంది. వీటితో పాటు జామ, బొప్పాయి టిష్యూకల్చర్ అరటి, పైనాపిల్, కోకో సాగు, సంకరజాతి కూరగాయలు, పూల సాగుకూ ప్రభుత్వం రాయితీ అందిస్తోంది.



ఆర్.వి.వి ప్రసాద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి



? తుపాన్లు, తెగుళ్లతో కొబ్బరి పంట దిగుబడి తగ్గడంతో ఉద్దాన ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొబ్బరి రైతులకు ప్రభుత్వం ఎటువంటి ప్రోత్సాహం అందిస్తోంది?

కొబ్బరి పునరుద్ధరణ పథకం కింద దిగుబడి లేని చెట్లు, తెగుళ్లు, పురుగులు సోకిన చెట్లతో పాటు ఎక్కువ వయసున్న చెట్లను తొలగించి కొత్త మొక్కలను నాటుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఈ పథకం కింద ఎకరాకు గరిష్టంగా రూ.21,400 అందిస్తోంది. కొబ్బరి చెట్లకు గరిష్టంగా ఎకరాకు 12,800, కొబ్బరి మొక్కలకు ఎకరాకు గరిష్టంగా రూ.1600 ప్రభుత్వం ఇస్తోంది. తోటల నిర్వహణ కోసం ఎకరాకు గరిష్టంగా ఏడాదికి రూ.3,500 చొప్పున రెండు సంవత్సరాలు అందిస్తోంది.

? కూరగాయలు, పూల సాగు చేసే రైతులకు సంబంధించి ఎటువంటి పథకాలు అమల్లో ఉన్నాయి?

కూరగాయల్లో ప్రత్యేకించి హైబ్రిడ్ రకాలను సాగు చేసే రైతుల కోసం ప్రభుత్వం సంకర జాతి కూరగాయల విస్తరణ పథకం అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా ఎకరాకు రూ.ఎనిమిది వేలు అందిస్తోంది. పూలు సాగు చేసే రైతులకు పూల తోటల విస్తరణ పథకం అందుబాటులో ఉంది. ఈ పథకం కింద ఎంపికైన రైతులకు ఎకరాకు రూ.6,400 ప్రభుత్వం ఇస్తోంది.

? పంట ఉత్పత్తుల ప్యాకింగ్, ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పే వారికి రాయితీలు ఏమైనా అందిస్తున్నారా?

పంట ఉత్పత్తుల ప్యాకింగ్ కోసం ప్యాకింగ్ గొడౌన్లు నిర్మించే వారికి 50 శాతం రాయితీ లేదా రూ.రెండు లక్షల వరకు రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. అదేవిధంగా జీడి, మామిడి ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పే వారికి 40 శాతం సబ్సిడీ లేదా రూ.10 లక్షల వరకు ప్రభుత్వం మంజూరు చేస్తోంది.

? ఉద్యాన మౌలిక సదుపాయాల నిధి కింద కోల్డ్ స్టోరేజి నిర్మాణాలకు ప్రభుత్వం ఎటువంటి ప్రోత్సాహం అందిస్తోంది?

పంటకోత తర్వాత నష్టాలు తగ్గించడం, మంచి మార్కెట్ ధర పొందటంతో పాటు నిల్వ, మార్కెటింగ్‌లో దళారులను నియంత్రించడానికి కోల్డ్‌స్టోరేజీ నిర్మాణాలకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మౌలిక సదుపాయాల కింద ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనేజేషన్ కింద నమోదైన రైతులకు 75 శాతం సబ్సిడీ అందిస్తోంది.



మాట్లాడుతున్న వెంకటరమణమూర్తి

ఉచిత ఇసుక విధానం మంచిదే

మెళియాపుట్టి: రాష్ట్రంలో ఉచిత ఇసుక ప్రజలకు అందించే విధానం చాలా మంచిదేనని మాజీ శాసనసభ్యులు, జిల్లా టిడిపి అధ్యక్షులు కలమట వెంకట రమణమూర్తి అన్నారు. ఆదివారం మెళియాపుట్టి వచ్చిన సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ ఇసుక విధానం వలన పేద ప్రజల ఇల్లు నిర్మాణానికి ఎంతో మేలు కలుగు తుందన్నారు. ఈ విధానం పేద ప్రజలకు వరమన్నారు. పేద ప్రజలకు ఇసుక అందకపోవడంతో గతంలో పేదవారు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపట్టబోయే ప్రతి కార్యక్రమం పేద ప్రజలకు ఆనందాన్ని ఇస్తుందన్నారు. ఈయనతో పాటు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కృష్ణదాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా కృష్ణదాస్ జన్మదినం

ప్రజాశక్తి- పోలాకి

జిల్లా వైసిపి అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ జన్మదిన వేడుకలు ఆదివారం మబగాంలో అభిమానుల కొలహలం నడుమ అత్యంత ఘనంగా జరిగాయి. నాలుగు మండలాల నుంచి వైసిపి నాయకులు అధిక సంఖ్యలో వచ్చి కృష్ణదాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నాయకులు, కార్యకర్తలతో మబగాం వీధులు కిక్కిరిసిపోయాయి. మండల నాయకత్వం కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. యువ నాయకులు, పోలాకి జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య, ధర్మాన రామలింగం నాయుడు, మాజీ డిసిసిబి ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, వైసిపి నాయకులు కణితి కృష్ణారావు, ఆర్.త్రినాథరావు, కార్యకర్తలు, భిమానులు పాల్గొన్నారు.



పుస్తకాలను అందజేస్తున్న విజయగౌరి తదితరులు

గ్రంథాలయం యువతకు ఉపయోగకరం

ఎచ్చెర్ల: మండల పరిధిలో గల పరిదిపేటలో కొత్తకోట రామలక్ష్మి గ్రంథాలయానికి రూ.6 వేలు విలువగల పుస్తకాలను ఉపాధ్యాయురాలు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కోరండ్ల విజయగౌరి గ్రంథాలయ నిర్వహకులు కొత్తకోట అప్పారావుకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు ఉపయోగించుకుంటూ జ్ఞానవంతులుగా తయారవ్వాలని కోరారు. నేటితరం యువత పుస్తకాలను శ్రద్ధగా చదువుకుంటే తమ జీవితాలకు బాటగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వాగ్దేవి, మాజీ ఎంపిటిసి కొత్తకోట అమ్మినాయుడు, యుటిఎఫ్ ఉపాధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ పొందూరు అప్పారావు, ఎండ ఉమాశంకర్, జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, జిల్లా నాయకులు స్వర్ణకుమారి, పాఠకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

కల్లుగీత వృత్తిని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి- పోలాకి

ప్రాచీన వృత్తి అయిన కల్లుగీత వృత్తిని బలోపేతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుబ్బ కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడ ఎంబి భవనంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాక రామచంద్రరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గీత వృత్తిని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, గతంలో ప్రభుత్వ మనుగడకు గీత వృత్తే ప్రధాన కారణమైందని గుర్తు చేశారు. సంఘం ముఖ్య సలహాదారులు భాస్కరయ్య మాట్లాడుతూ గీత వృత్తి ద్వారా ఆరోగ్యంతో పాటు అనేక ఉపాధి మార్గాలు అన్వేషించారని అన్నారు. ఇందుకు ఉభయగోదావరి జిల్లాలో ఇటీవల విద్యార్థులు పరిశోధనలో ఆసక్తికరమైన విషయాలు బయట పెట్టినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత ఎన్నో రసాయనిక ద్రవాలు బజార్లలో అమ్ముడుపోవడంతో ప్రజారోగ్యం కుంటుపడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి మాట్లాడుతూ గీత కార్మికుడు ప్రమాదంలో మృతి చెందిందితే రూ.పది లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుడు వృత్తి కోసం ప్రతి ఈత తాటి చెట్టపై రూ.పది కిస్తీ ప్రభుత్వం కట్టించుకోవాలని కోరారు. ప్రభుత్వం గీత కార్మికుడికి వృత్తి భద్రత ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు.

'సత్యసాయి' డైరెక్టర్ కృష్ణమూర్తి మృతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం



కృష్ణమూర్తి (ఫైల్)

ఇచ్ఛాపురం పట్టణంలోని సత్యసాయి డైరెక్టర్, విశ్రాంతి ప్రభుత్వ ఉపాధ్యాయులు షావుకారి కృష్ణమూర్తి (62) ఆదివారం మృతి చెందారు. ఉదయం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటుండగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. ఇటీవలే గుండె సమస్య రావడంతో చికిత్స చేయించుకున్నారు. మూడున్నర దశాబ్దాల పాటు వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించి వేలమంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ స్వచ్ఛంద కార్యక్రమాల ద్వారా అనేక సేవలను అందించారు. రోటరీ క్లబ్ రొటేరియల్‌గా అనేక సేవలు అందించి అందరి మన్ననలు అందుకున్నారు. పట్టణంలోని సత్యసాయి పాఠశాలను స్థాపించి వేలాదిమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులను నింపారు. కృష్ణమూర్తి మాస్టార్ మృతికి పట్టణమంతా అశ్రు నివాళ్లర్పించారు.

నేడు ప్రయివేటు విద్యా సంస్థల బంద్

సత్యసాయి పాఠశాల వ్యవస్థాపకులు, అందరికీ గురుసమానులు కృష్ణమూర్తి మాస్టార మృతితో పట్టణంలోని ప్రయివేటు పాఠశాలల సంఘ సభ్యులు, కర్సాండెంట్లు సంతాపాన్ని తెలియజేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపాలిటీలోని మండలంలోని ప్రయివేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాలని సంఘ సభ్యులు నిర్ణయించారు. సంతాపం తెలిపిన వారిలో నియోజకవర్గంలోని ప్రయివేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు చాట్ల తులసీదాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు దక్కత కృష్ణ మూర్తిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లంటి చిరంజీవి, కార్యదర్శి మార్కం డేయులు, పాఠశాలల కరస్పాండెంట్లు జోహార్ ఖాన్, గిన్ని వెంకట రమణ, కోట రామారావు, ఢిల్లేశ్వరరావు, జి.కోకిల, తిరుపతిరావు, శేఖర్ ఉన్నారు.

సోంపేట : కృష్ణమూర్తి ఇచ్ఛాపురం నియోజవర్గ సొండిల సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షులు ఎం.సింహాచలపతి, రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షులు రత్నాల కాశీ విశ్వనాథ్ చౌదరి, రాష్ట్ర కోశాధికారి రత్నాలు శ్రీనివాసరావులు సంతాపాన్ని తెలియజేశారు.

చినుకు పడితే చెరువే



చెరువులా మారిన ప్రధాన రహదారి

పట్టించుకునే నాథుడు కరువాయే

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

చినుకు పడితే చిత్తడిగా మారి చెరువును తలపించేలా ఆర్‌టిసి బస్‌స్టాండ్ మారి రాకపోకలు కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండల ప్రజలు ప్రజా ప్రతినిధులు, అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సరుబుజ్జిలి మండల కేంద్రంలో చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారి చెరువులామారి దారి కనపడక ఇబ్బందుల పాలవుతున్నామని వాహనదారులు, ప్రజలు చెబుతున్నారు. ఇదే విషయాన్ని గత పాలకుల దృష్టికి తీసుకువెళ్లామని వారు శిలాఫలకాలు వేసి చేతులు దులుపుకున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వర్షానికే ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణమంతా జలమయమై చెరువుని తలపిస్తూ ఉంటుందని దీంతో రాకపోకలు కొనసాగించే వాహనదారులు, ప్రయాణికులు పడుతున్న బాధలు వర్ణనాతీతమని పలువురు చెబుతున్నారు. వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండడంతో పలు రకాల అంటు వ్యాధులు వ్యాపిస్తున్నా యని, అలాగే రహదారిపై నీరు నిల్వ ఉండడంతో గోతులు తెలియక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. దీనివల్ల నిత్యం రాకపోకలు సాగించే వాహనాలు, ప్రయాణికులు, గ్రామస్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం.ప్రభుత్వాలు మారుతున్నాయిగాని, తమ గోడును పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రయాణికులు ప్రజలు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎన్నో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా వారి తిప్పలు తప్పడం లేదు. గ్రామస్తుల గోడును వినే నాథుడు కరువయ్యాడు. ఇప్పటికైనా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు తాము పడుతున్న బాధను గ్రహించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపించాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్

స్టేడియంను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో ప్రతిష్టాత్మకంగా ఉన్న కోడిరామ్మూర్తి స్టేడియం పున:నిర్మాణ పనుల పురోగతిపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కోడిరామ్మూర్తి స్టేడియంను ఆర్‌అండ్‌బి, క్రీడాప్రాదికారిత అధికారులతో కలిసి సందర్శించారు. స్టేడియం పూర్వపు స్థితిని తెలుసుకున్న ఆయన జిల్లాలో ఇండోర్, ఔట్‌డోర్‌లలో ఏయే క్రీడలను నిర్వహించేందుకు అవకాశముందని ప్రశ్నించారు. అసంపూర్తి నిర్మాణంలో ఉన్న భవన సముదాయంతో పాటు స్టేడియం గ్యాలరీ అసంపూర్తి నిర్మాణాలను పరిశీలించారు. అలాగే జిమ్స్, ప్రాక్టీస్, డ్రస్ చేంజ్ రూంల నిర్వహణపై కోచ్ శ్రీధర్‌తో చర్చించారు. స్టేడియం నిర్మాణంతో పాటు నిధుల అవసరాన్ని నివేదించాలని ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్‌ను ఆదేశించారు. శాప్ నుంచి ఇప్పటివరకు వచ్చిన నిధుల వినియోగంపై కూడా నివేదికలో వివరాలు పొందు పర్చాలన్నారు. కలెక్టర్‌తో పాటు ఆర్‌అండ్‌బి ఇఇ రవినాయక్, వాలీబాల్ కోచ్ కె.హరి, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగావళి డైక్ పరిశీలన

ఆర్ట్స్ కళాశాల సమీపాన నాగవళి నదిలో తాగునీటి అవసరాలు తీర్చడానికి నీటి నిల్వకు అవసరమైన డైక్ నిర్మాణం పనులను కలెక్టర్ పరిశీలించారు. డైక్ నిర్మాణ పనుల్లో జాప్యంతో వరద సమయంలో కోతకు గురై కెఆర్ స్టేడియంకు అనుకుని ఉన్న రక్షణగోడ కూలి పోయిందని, దీనివలన స్టేడియంతో పాటు లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరిందని అధికారులు ఆయనకు వివరించారు. రక్షణగోడ నిర్మాణానికి టిఆర్ 27 నిధుల నుంచి రూ.5.75 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, ఈ పనులు మంజూరైతే డైక్ నిర్మాణంతో పాటు రక్షణగోడ పూర్తిచేయడానికి వీలవుతుందని అధికారులు వివరించారు.

నేటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ వ్యాపంగా అగ్నివీర్ వాయు విభాగంలో యువత చేరేందుకు సోమవారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేందుకు వీలు కల్పించినట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య జన్మించిన భారతీయులైన యువకులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ ఎంపిసిలో 50 శాతం మార్కులతో పాటు ఇంగ్లీష్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉన్న వారే అర్హులని తెలిపారు. ఇంటర్ ఒకేషనల్ చదివిన విద్యార్థులు సైతం దరఖాస్తు చేసు కోవచ్చన్నారు. సోమవారం నుంచి ఈనెల 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

బ్రాహ్మణ సంఘ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి నియోజకవర్గంలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవ ంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మామిడి శ్రీనివాస్‌శర్మ, కార్యదర్శిగా వడుగూరు రాజేష్ ఎన్నికయ్యారు.

ఇళ్ల పట్టాల పంపిణీలో అవకతవకలు

పోలాకి: మండలంలో ఇళ్ల పట్టాలు మంజూరులో చేస్తున్న అవకతవకలపై సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తామని నరసాపురం యువజన సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం పోలాకి కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నరసాపురం వద్ద ఇచ్చిన జగనన్న లే అవుట్‌లో, ఇందిరానగర్ నీళ్ల ట్యాంకు దగ్గర ఉన్న స్థలం లోను రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా ఇళ్ల పట్టాలు మంజూరు చేసి అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల నుంచి తహశీల్దార్ కార్యాల యంలో ఫిర్యాదు చేసినప్పటికీ సరైన స్పందన లేదని వారు విచారం వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే శంకర్‌కు స్వాగతం

శ్రీకాకుళం అర్బన్: టిడిపి విజయోత్సవాల్లో భాగంగా నగర శివారులో ఉన్న కొత్తపేట, పెద్దపాడు గ్రామ దేవతల ఉత్సవాలను ఆది వారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే గొండు శంకర్, స్వాతి దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతులను గ్రామస్తులు సత్కరించారు. బరాటం రమణ, వాసు, కొత్తపేట, పెద్దపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పొడుగు నారాయణమ్మ కాలనీలో నివాసముంటున్న రాష్ట్ర టౌన్ ప్లానింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొన్న వాసు సోదరుడు సత్యనారాయణ మూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆదివారం సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్ ఉన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పోలాకి: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల విత్తనాలు, పంట రుణాలు కౌలు రైతులకు ఇచ్చి కౌలు రైతులను ఆదు కోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ కోరారు. ఆదివారం మబగాం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో వైసిపి ప్రభుత్వం తెచ్చిన కౌలు రైతుల చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆదీకృత చట్టాన్ని అమలు చేయాలన్నారు. అలా గే విత్తనాలు, ఎరువులు రాయితీపై ఇవ్వాలని కోరారు. సహాధ్యక్షులు జి.రెయ్యన్న, జిల్లా ఉపా ధ్యక్షులు ఎం.చక్రవర్తి, పోలాకి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జీవశాస్త్రాన్ని సమగ్రంగా బోధించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జీవ శాస్త్రంపై విద్యార్థుల్లో ఆసక్తి కలిగించేలా సమగ్ర బోధన జరగాలని ఎపి బిఎస్‌టిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ గౌస్ అన్నారు. ఈ అకడమిక్ సంవత్సరంలో కొత్తగా 10వ తరగతి జీవ శాస్త్ర పాఠ్యపుస్తకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఆదివారం జిల్లా జీవశాస్త్ర ఉపాధ్యాయుల (ఎపి బిఎస్‌టిఎఫ్) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు పుట్టా ఉదయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ గౌస్ మాట్లాడుతూ 10వ తరగతి జీవశాస్త్రం కొత్త సిలబస్‌పై విశ్లేషణ, ఆవశ్యకతను వివరించారు. కొత్తగా ప్రవేశపెట్టిన పదవ తరగతి జీవశాస్త్ర పాఠ్యపుస్తకంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండలన్నారు. మారిన పాఠ్యపుస్తకంలో కుదించబడిన పాఠ్యాంశాలను (కాన్సెప్ట్)లను గత పాఠ్యాంశాలతో జతచేసి సమగ్రంగా బోధించాలన్నారు. విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించి విద్యా బోధన కొనసాగించాలని, సిబిఎస్ఇ, స్టేట్ సిలబస్, పరీక్ష విధానంలో తేడాలపై జీవశాస్త్ర ఉపాధ్యాయులు పూర్తి అధ్యయనం తర్వాత విద్యార్థులకు బోధించా లన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలో వివిధ డివిజన్లలో జీవశాస్త్ర ఉపాధ్యాయుల కాన్ఫరెన్స్‌లను నిర్వహించి ఫోరంను బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రకమిటీ సభ్యులు ప్రమోద్ కుమార్ పాడి మాట్లాడుతూ ఫోరం ఆధ్వర్యాన అకడమిక్ వింగ్ బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రకమిటీ సభ్యులు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ చార్లెస్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించడం ద్వారా అశాస్త్రీయ భావనలకు అవకాశం కలుగుతుందని, ఫోరం ఆధ్వర్యాన విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఫోరం అడ్వైజర్ సువ్వారి ఉమా మహేశ్వరి ఫోరం జిల్లా నూతన కమిటీని సభ్యులకు పరిచయం చేసారు. జిల్లా నాయకులు మురళీ, త్రివిక్రమ్, కవిత, గగన కుమారి, ఇంజరాపు రేవతి తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లిని సందర్శించిన గ్రూప్-1 అధికారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా గ్రూప్-1 అధికారులుగా ఎంపికై శిక్షణ పొందుతున్న 2023 బ్యాచ్ అధికారులు ఆదివారం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆల యాన్ని ఆదివారం సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. స్వామివారి సేవలో పాల్గొన్న వారికి ఆలయ ప్రాంగణంలో ఉన్న అనివేటి మండపంలో శేష వస్త్రాలను కప్పి చిత్రపటాలను అందజేశారు. అరసవల్లి సందర్శించిన వారిలో పరిపాలనాధికారులుగా శిక్షణ పొందుతున్న మనోజ్, ప్రదీప్, మల్లికార్జునరావు,, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్స్ రేణుకయ్య, సాయి రాజేష్, అసిస్టెంట్ కమీషనర్లుగా ఉన్న జ్ఞానా నందరెడ్డి, సురేంద్ర రెడ్డి, రాకేష్, భార్గవ్, పోస్టుమాస్టర్‌గా శిక్షణ పొందుతున్న సాయి రాంకుమార్, కెనరా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్, ఎల్‌ఐసి హెచ్‌జి గోపాల్ కృష్ణ, అమర్ తదితరులున్నారు.



దర్శించుకుంటున్న గ్రూప్-1 అధికారులు

ఆదాయం రూ.5.59 లక్షలు

సూర్యనారాయణ ఆలయానికి ఆదివారం టికెట్లు విక్రయాల ద్వారా రూ.2,60,800, విరాళాల రూపంలో రూ.69,813, ప్రసాదాల విక్రయాల రూపంలో రూ.2,27,415 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇఒ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

పింఛను పెంపుపై హర్షం



రక్తదానం చేస్తున్న వికలాంగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నోటిమాట రాక సైగలతోనే జీవితాన్ని కొనసాగిస్తున్న మూగవారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అందులో భాగంగా పింఛన్ మొత్తాన్ని రూ.6 వేలకు పెంచడం జరిగిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల ఎ1 హోటల్‌లో జిల్లా డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యాన సిఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ చెవిటి, మూగ వికలాంగులు రక్తదానం చేశారు. న్యూబ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ శిబిరంలో 60 మంది వికలాంగులు రక్తదానం చేశారు. సామాజిక బాధ్యతతో ప్రభుత్వం అర్హులైన అందరికి పింఛన్ ఇస్తున్నట్టు తెలిపారు. వికలంగుల సమస్యలుంటే తాను పరిష్కరి ంచేందుకు ముందుంటానన్నారు.

పలువురు ఆర్థికసాయం

కొత్తూరు: పార్వతీపురం మన్య జిల్లా సీతంపేట మండలం చిన్నబగ్గకు చెందిన గిరిజనుడు ఆరిక త్రినాథరావు ఇల్లు ఇటీవలి గాలులకు అతలాకుతలమైంది. దీంతో ఎండ, వాన నుంచి రక్షణ లేకుండాపోయింది. భార్య, నలుగురు పిల్లలతో ఇదే ఇంట్లో నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయం కొత్తూరు మండలానికి చెందిన భగత్ సింగ్ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు ఈ నెల 1న పరిశీలించారు. వారం రోజుల్లో ఇల్లు నిర్మించారు. ఆదివారం కుటుంబంతో గృహప్రవేశం చేయించారు. అలాగే కొత్తూరుకు చెందిన జడ్డు రామకృష్ణ బాధితులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఇల్లు నిర్మించడంతో త్రినాథరాబు కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అలాగే భామిని మండలం సతివాడకు చెందిన పున్నాన జయలక్ష్మి భర్త ఇటీవల మృతి చెందారు. ఆమెకు వికలాంగుడై కుమారుడు, పదో తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. జయలక్ష్మి కూడా అనారోగ్యంతో బాధపడడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ట్రస్టు సభ్యులు రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో హరి, లోకేష్, ఎ.భగవాన్, తిరుపతి, పోలినాయుడు, రమేష్ పాల్గొన్నారు.

లావేరు: మండలానికి చెందిన సహాయం చేస్తున్న హదయలు ఫౌండేషన్ సభ్యులు విజయనగరం జిల్లా సంతకవిటి మండలం హొంజరాంకు చెందిన నిరుపేద ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఇటీవల అనారోగ్యానికి గురై గుండె సంబంధిత సమస్యతో బాధ పడుతున్న విషయం తెలుసు కున్న ఫౌండేషన్ సభ్యులు ఆదివారం హొంజరాం చేరుకొని మందులు నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. సభ్యులు అప్పలరాజు, సత్తిబాబు ఉన్నారు.

టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస



లక్ష్మణరావు (ఫైల్)

మండలంలోని వెదుళ్లవలసకు చెందిన టిడిపి యువ నాయకుడు బత్తుల లక్ష్మణరావు (బుజ్జి) (47) డయేరియా లక్షణాలతో ఆదివారం మృతి చెందాడు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి తరపున అహర్నిశలు శ్రమించిన వ్యక్తి అకాల మరణం పొందడంపై ఎమ్మెల్యే కూన రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గడచిన రెండు రోజులుగా వాంతులు, విరోచనాలతో అనారోగ్యానికి గురైన బుజ్జిని కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యసేవలు పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మండల టిడిపి అధ్యక్షులు నూక రాజు, నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, అన్నెపు భాస్కరరావు, నేతింటి జ్యోతి వెదుళ్లవలసలో మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సంద ర్భంగా టిడిపి మండల అధ్యక్షులు రాజు మాట్లాడుతూ బుజ్జి మరణం పార్టీకి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గ్రామంలో వైద్యశిబిరం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రీనివాసరావు

డయేరియా లక్షణాలతో లక్ష్మణరావు (బుజ్జి) మృతి చెందడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. తొగరాం పిహెచ్‌సి వైద్యుడు పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో బావుల్లో క్లోరినేషన్ చేపట్టారు. డయేరియా వ్యాధి లక్షణాలతో ఉన్న రోగులను గుర్తించడానికి ఇంటింటి సర్వే చేపట్టారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాచి వడబోసిన నీటినే తాగాలని, ఎవరికైనా డయేరియా లక్షణాలుంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ గోపి బాల, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, ఇఒపిఆర్‌డి దుంపల గోవిందరావు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

10న డిమాండ్స్ డే

ప్రజాశక్తి- మెళియాపుట్టి

దేశ వ్యాప్తంగా ఈనెల 10న జరగనున్న డిమాండ్స్ డే కార్య క్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమలు చేయరాదని హెచ్చరించడానికి, కార్మికుల హక్కులు సాధించడానికి డిమాండ్స్ డే ను చేపడు తున్నట్లు సిఐటియు దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిందని అన్నారు. అలాగే కనీస వేతనాలను నెలకు రూ.26 వేలు నిర్ణయి ంచి అమలు చేయాలని ప్రైవేటీకరణ, జాతీయ నగదు బదిలీ పథకాన్ని నిలుపుదల చేయాలని, నూతన పెన్షన్ స్కీం రద్దు చేయాలని, పాత పెన్షన్ అమలు చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని మామిడిపల్లి పంచాయతీ చిన్నమామిడిపల్లిలో ఉన్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సిసి రోడ్డు, శ్మశాన వాటికకు రోడ్డు, పశు వైద్యశాలకు వైద్యాధికారి, కార్యదర్శి ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో తిమ్మల వీరస్వామి, దున్న వీరాస్వామి, గొరకల రామారావు, సంగారు ధర్మరాజు, రత్నాల వాసు, గేదల జనార్ధన, దాసరి బలరాం, గొరకల ఆనందరావు, సంగారు చిరంజీవి, గేదెల కూర్మారావు, పాతని డిల్లేశ్వరరావు, సొర్ర రాము పాల్గొన్నారు.

పిఎసిఎస్ సిఇఒకు సన్మానం

ప్రజాశక్తి- నందిగాం

మండలం తెంబూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిఇఒగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎ.రామారావుకు కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిజిఎం ఎస్.రమేష్, మేనేజర్లు శివప్రసాద్, దుర్గాప్రసాద్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కె.బాలకృష్ణారావు, పి.చిరంజీవులు, పి.చంద్ర శేఖరరావు, స్థానిక సర్పంచ్ మోహనరావు, కె.ధర్మారావు, హరిబాబు, ఎస్.అప్పన్న ఉన్నారు.



విరాళం అందజేస్తున్న ప్రసాద్

ఆలయాల నిర్మాణానికి విరాళం

కవిటి: కవిటి బెహరా వీధిలో పునర్నిర్మిస్తున్న శ్రీ జగన్నాథ స్వా మి దేవా లయం, కవి టిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి ప్రగడపుట్టుగకు చెందిన పూడి ప్రసాద్, పూడి రామకృష్ణ సోదరులు రూ.16, 200 విరాళంగా అందజేశారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధి కలిగిన జగన్నాథ స్వామి ఆలయం, నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి దాతల సహకారం అవసరమన్నారు. ఇప్పటికే పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఆసక్తి కలిగిన దాతలు విరాళాలు అందిస్తే అనతి కాలంలోనే ఆలయాల నిర్మాణం పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్, బెందాలం వెంకటరావు, మొగిలిపురి సీతాలు, బిపి రెడ్డి, దీపక్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్లుపై చెత్త తొలగిస్తున్న సభ్యులు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఇచ్ఛాపురం: స్వేచ్ఛ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ కూన విష్ణుమూర్తి ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మండలంలో ప్రతి ఆదివారం ఒక్కో గ్రామంలో నిర్వహి స్తున్నారు. ఇందులో భాగంగా ఈ వారం ముచ్చింద్ర గ్రామంలో విద్య, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత తదితర విషయాలను వివరిస్తూ వర్షాకాలంలో నీటిని వేడి చేసి తాగాలని సూచించారు. ఎన్‌జిఒ సభ్యులు, గ్రామస్తులు కలిసి శ్రమదానం చేసి రోడ్డుపై ఉన్న చెత్తను చీపుర్లతో తొలగించారు. ముచ్చింద్ర సర్పంచ్ గురుమూర్తి, డాక్టర్ పూడి కిరణ్ కుమార్, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ డి.హరి శ్చంద్ర, ఎం.సాయికృష్ణ, ఎ.విశ్వనాథం, సిహెచ్ రవి కుమార్, ఎస్.సంతోష్, బి.మనోజ్, కుమార్, ఎస్ ప్రవీణ్, జి.బలరాం, రాము, కుమారి పాల్గొన్నారు.

ఘనంగా సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని గూనపాలెంలో ఉన్న శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యాన 94వ నెలవారీ సాహితీ సమ్మేళనం ఆదివారం జరిగింది. తెరవే అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకటరమణ మూర్తి ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో 13 మంది కవులు తమ కవితలను, రచనలు చదివి వినిపించారు. ఐ.యన్.డి ప్రసాద్ (ఆంధ్ర కల్పవృక్షం), ఇద్ది పాపయ్య (శ్రద్ధాంజలి), యు.నాగేశ్వరరావు (భూమాత), తోట గోపాలరావు (అపూర్వ కథ), ఆర్.వి.రమణ మూర్తి (గురుబ్రహ్మ), గుడిమెట్ల గోపాల కృష్ణ (జీవితమే క్రికెట్), కె.బి.రవికిరణ్ (సాలెగూడు జీవితం), పి.వి.దుర్గా ప్రసాద్ (చిమ్నీలు), తంగి ఎర్రమ్మ (స్ఫూర్తి), రెడ్డి లలిత (అమ్మ ఒడిలో), ముట్నూరి ఉపేంద్ర శర్మ (కలికాలం), సోడవరం ఈశ్వరరావు (రాక్షస పాలన), బి.జగన్నాథరావు (కాలుష్యం-మానవుడు) పేరుతో తమ రచనలను సభకు పరిచయం చేశారు.



తెరవే సమ్మేళనంలో పాల్గొన్న రచయితలు

కదిలిన రథచక్రాలు



పలాస : రథాన్ని ఊరేగిస్తున్న యాత్రికులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలిలో జగన్నాథస్వామి రథయాత్ర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక పెద్దబ్రహ్మణవీధి జగన్నాథ స్వామి ఆలయంలో ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలను టెక్కలి రాజవంశీయులు కమల్ కుమార్ దేవ్ ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోలాహలం నడుమ స్వామివారి రథచక్రాలు ముందుకు సాగాయి.

పలాస: కాశీబుగ్గ సాయిరాం ఆలయం వద్ద తొలిదశమి జగన్నాథస్వామి రథయాత్ర ప్రారంభమైంది. జగన్నాథ స్వామి రథాన్ని తాళ్లతో తాగుతూ ఊరేగింపుగా జగన్నాథ స్వామి, బల భద్రుడు, సుభద్ర విగ్రహాలను గుడించా మందిరానికి తీసుకువెళ్లారు. మండలం బ్రాహ్మణతర్ల, రెంటికోట, తర్లకోట గ్రామాల్లో జగన్నాథ స్వామి పాదయాత్ర ప్రారంభమైంది. జగన్నాథ స్వామిని దర్శించుకునేందుకు పలాస కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: జగన్నాథ స్వామి రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ బాబు రథయాత్రలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం కోవెల వీధిలో ఉన్న ప్రధాన ఆలయం నుంచి దాసాన్న పేట వద్ద ఉన్న గుడించా మందిరం వద్దకు యాత్ర కొనసాగింది. ఇక్కడ పది రోజుల పాటు వివిధ రూపాల్లో స్వామివారు యాత్రికులకు దర్శనమివ్వనున్నారు

కోటబొమ్మాళి: మండలంలోని హరి శ్చంద్రపురంలో జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు ఆలయ పురోహితులు అరవెల్లి విశ్వనాథశర్మ ఆధ్వర్యాన ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ రథయాత్రలో అన్ని విధుల్లో సాగింది. పెద్దఎత్తున యాత్రికులు పాల్గొన్నారు. ఐదు రోజులు పాటు నిర్వహించనున్నామని, యాత్రికులు పాల్గొవాలని ఆలయ కమిటీ సభ్యులు పూజారి సత్యన్నారాయణ కోరారు.




మొక్కలు నాటుతున్న హరిబాబు తదితరులు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- రణస్థలం

ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు అమ్మ పేరిట మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకుడు ఆర్.హరిబాబు అన్నారు. ఆదివారం హరిత సొసైటీ ఆధ్వర్యంలో వెంకటరావు పేటలో బంగారమ్మతల్లి ఆలయం ఎదురుగా అమ్మపేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పట్టణీకరణ, అభివృద్ధి, రియల్ ఎస్టేట్ పేరిట చెట్లు కొట్టివేయడంతో పర్యావరణానికి విఘాతం కలిగి అధిక ఉష్ణోగ్రతలు, వరదలు, కరువు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. పాఠశాల దశ నుంచే పిల్లల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన, చెట్ల నుంచి విత్తనాల సేకరణ, నర్సరీల ఏర్పాటు, మొక్కలు నాటే కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పి.తవిటినాయుడు, వన సంరక్షణ ప్రోత్సాహక కార్యకర్త వి.వీరారెడ్డి, బి.లక్ష్మణరావు, ఆర్.తవిటినాయుడు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న మధు

విద్యార్థినికి చేయూత

టెక్కలి: పట్టుశాలీ సంక్షేమ సంఘానికి చెందిన విద్యార్థిని హెచ్చిన షర్మిల పదో తరగతిలో అత్యున్నత మార్కులు సాధించారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యాన ప్రోత్సాహక బహుమతిని అందించారు. ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో షర్మిళ ఉన్నత విద్యాభ్యాసానికి రూ.పది వేలు నగదు ప్రోత్సాహక బహుమతిని సంఘ అధ్యక్షులు మల్లిపెద్ది మధు అందజేశారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులుగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన వడగ భాస్కరరావు, దుంపా సాంబమూర్తిలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి దుంపా శ్రీనివాస్, కోశాధికారి కొండేటి అచ్యుతరావు, బుడ్డ నందికేశవరావు, దున్న సాంబశివరావు, పమ్మిన సింహాచలం, ఆట్ల పార్వతీశం పాల్గొన్నారు.

రేషన్ షాపు ప్రారంభం

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండి పంచాయతీ మహాదేవిపురంలో రేషన్ షాపును జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వి.దుర్గారావు, టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి కణితి సురేష్‌లు ఆదివారం ప్రారంభించారు. గతంలో రేషన్ షాపు డీలరుగా కంచరాన జయమ్మ రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానంలో గ్రామానికి చెందిన ఎస్‌హెచ్‌జి సభ్యులు కూన రూపవతికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిపిఎల్ దిగువన ఉన్న పేదలకు బియ్యంతో పాటు ఇతర సరుకులు రేషన్ డిపో ద్వారా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కూన షణ్ముఖరావు, కంచరాన గోపాలరావు, శిష్ట సారథినాయుడు, కూన మోహనరావు, తమ్మినాన భీమారావు, సుధాకర్, రామారావు పాల్గొన్నారు.



బియ్యం పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

ఉచిత ఇసుక విధానంతో మేలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉచిత ఇసుక విధానంతో పేదలకు కార్మికులకు ఎంతో మేలు కలగనుస్నదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఇసుక దొరకడం ప్రజలకు గగనమైతే... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఉచితంగా ఇసుక అందించడం పేదలకు వరమని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన నూతన ఇసుక విధానం వల్ల పేదలకు భవన నిర్మాణ రంగ కార్మికులకు చాలా మేలు జరగనున్నదని తెలిపారు. భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన రాడ్ బెండింగ్ పెయింటింగ్ ఎలక్ట్రికల్ ప్లంబింగ్ తదితర కార్మికులకు ఉపాధి కలగనున్నదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్నారనడానికి ఇసుక విధానం ఒక్కటి చాలన్నారు.

'కుప్పిలి'కి రాష్ట్రస్థాయి బహుమతి

ఆమదాలవలస : పట్టణానికి చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావుకు మరో రాష్ట్రస్థాయి బహుమతి లభించింది. నెల్లూరుకు చెందిన 'అక్షరం' సంస్థ గత నెలలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కవితల పోటీల్లో రాజారావు రచించిన 'ఆ వేలి చుక్కను ఎప్పుడూ చుక్కెదురే' అనే కవితకు ప్రథమ బహుమతి లభించినట్లు సంస్థ నిర్వాహకులు చిన్ని నారాయణరావు సమాచారం పంపినట్లు తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.1016 నగదును పంపినట్లు రాజారావు తెలిపారు.



పరామర్శిస్తున్న అప్పలరాజు

మాజీ మంత్రి పరామర్శ

పలాస : పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కుమారుడుకు ఇటీవల ప్రమాదం జరిగింది. శాస్త్ర చికిత్స జరగడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆదివారం గిరిబాబు ఇంటికి వెళ్లి కుమారుడుని పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, మాజీ ఎంపిపి బత్తిన హేమేశ్వరరావు, కౌన్సిలర్లు బెల్లాల శ్రీనివాసరావు, దుర్గాశంకర్ పండా తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ఈశ్వరరావు జన్మదినం

రణస్థలం రూరల్ : మండలంలోని నడుకుదిటిపాలెంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులు, అధికారుల మధ్య కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, అధికారులు వచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ విష్ణు కుమార్‌రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాలను నగరంలో ఘనంగా నిర్వహించారు. 33వ డివిజన్ గూనపాలెంలో ఎంఆర్‌పిఎస్ జెండాను ఎగుర వేశారు. ముందుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి అరసవల్లి జంక్షన్‌లో పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో పలువురు నేతలు మాట్లాడారు. ఎంఆర్‌పిఎస్, ఎంఇఎఫ్ ఆవిర్భవించి మూడు దశాబ్దాలు పూర్తయిందని, నేటికి పాలకులు ఎస్‌సి జాబితాను వర్గీకరించక పోవడం అన్యాయమన్నారు. జాతీయ స్థాయిలో ఉద్యమిస్తూ మందకృష్ణ మాదిగ నాయకత్వాన పోరాటాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్, ఎంఇఎఫ్ మహిళా విభాగం నాయకురాలు ఇద్దిమాల సుజాత, పొట్నూరు దానం, చిన్నారి, హరీష్ కుమార్, పొట్నూరు రాజు, రామారావు, తిరుమలరావు, లక్ష్మణరావు, వై.ప్రసన్న కుమార్, బోసు మన్మధరావు, నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలువలు లేక తప్పని తిప్పలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

డివిజన్ కేంద్రమైన టెక్కలి పలు వీధుల్లో కాలువలు లేక ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్థానిక ఎన్‌టిఆర్ కాలనీ, శ్రీనివాస నగర్, సంబాన వీధి, మెట్ల వీధి, కచేరి వీధి, చేరి వీధి, విజారపు వీధి, గోపినాథపుర వీధుల్లో కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు లేక నీరు ఎటూ వెళ్లక రహదారి మధ్యలో నిలిచి నడిచే వారికి ఇబ్బందికరంగా మారుతుంది. ఆ నిల్వ ఉన్న నీటిలో ఇళ్లలో వాడిన మురికినీరు కూడా చేరి దుర్వాసనను, క్రిమి కీటకాలు, దోమలు చేరడంతో అనారోగ్యానికి గురి చేస్తుందని స్థానికులు వాపోతున్నారు. ప్రతిరోజు స్థానికులు ఆ మురికి నీటి రోడ్డు మార్గంలోనే నడక సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. పగలు నడిచిన, రాత్రి అయితే ఆ మురికి నీటిలో ఎటువంటి క్రిమి కీటకాలు ఉంటాయోనని భయంతో నడవలేని దుస్థితిలో ఉన్నామని ప్రజలు వాపోతున్నారు. రానున్న రోజుల్లో వర్షాలు కురుస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఎన్‌టిఆర్ కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువ నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కారించాలని కోరుతున్నారు.



ఎన్‌టిఆర్ కాలనీ రోడ్డుపై మురుగు నీరు

అమ్మో.. పూండి రోడ్డు



బెర్మలు వేయకుండా వదిలేసిన పూండి రోడ్డు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పూండి రోడ్డు అంటేనే స్థానికులు హడలిపోతున్నారు. నౌపడ-వెంకటాపురం వయా పూండి రోడ్డు విస్తరణ చేయాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప ఈ రోడ్డు పరిస్థితి మారడం లేదు. గత ప్రభుత్వం పూండి పరిధిలో రోడ్డు పనులు చేపట్టేందుకు వైసిపి నాయకుల చేతులమీదుగా ఎన్నికలకు ముందు హడావుడిగా శంకుస్థాపన చేసారు. అయితే శంకుస్థాపన చేసినంత శ్రద్ధ పనులు చేయడంలో లేకపోయిందని విమర్శ లున్నాయి. కొన్నాళ్లు జెసిబితో తవ్వేసిన రోడ్డుతో తంటాలు పడ్డామని స్థానికులు చెబు తున్నారు. ఇంకొన్నాళ్లు మెటల్ వేసి వదిలేయడంతో వాహన చోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం చిన్న మురహరిపురం నుంచి పూండి వరకు సింగిల్ లేయర్ తారురోడ్డు వేసారు. అయితే రోడ్డు ఎత్తు పెరగడం, రోడ్డుకి ఇరువైపులా బెర్మలు వేయలేదు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించడానికి ఇబ్బంది పడు తున్నామని, వాహనం రోడ్డు దిగితే తిరిగి రోడ్డుపైకి ఎక్కించడం సమస్యగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు వేసిన మేరకు ఇరువైపులా బెర్మలు వేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.